సహా వెళ్ళారు రంగారావుగారు. ఆరోజు అలవాటుగా శరణాలయం తిరిగిచూసి పిల్లలకి మిఠాయిలు, బట్టలు పంచిపెట్టాక రంగారావు పిల్లలని ఉద్దేశించి మీటింగులో మాట్లాడుతున్నారు. శరణాలయం తీర్చి దిద్దడానికి అనాధ బిడ్డలకి ఆశ్రమం యివ్వడానికి తమ చేతనయినంతగా కృషి చేస్తామని-పిల్లలందరూ బుద్ధిగా చదువుకుని ప్రయోజకులవాలని కాంక్షిస్తున్నామని ఉపన్యాస ధోరణిలో చెపుతున్నారు. అంతలో పిల్లల మధ్యనించి ఒక అమ్మాయి లేచి నుంచుంది. వినయంగా నమస్కరించి తమతో రెండుమాటలు మాట్లాడడానికి అనుమతిస్తారా ?" అంది ధైర్యంగా. రంగారావు అశ్చర్యంగా చూచారు. అక్కడున్న వాళ్ళకి పెద్ద పిల్లగావుంది కట్టుకున్న చీర పాతపడినా శుభ్రంగా, పొందికగా కట్టుకుంది. మొహంలో తెలివితేటలు కనిపించాయి. అట్టే రంగు లేకపోయినా ముఖం తీరుగావుంది. ముఖ్యంగా కళ్ళు మెరుస్తున్నాయి. చాలా పేదగా, నిరాడంబరంగా ఉన్నా ఆమె మొహంలో, మాటలో ఆత్మ విశ్వాసం, సంస్కారం కనిపించాయి, రంగారావు ఆమెని ఆశ్చర్యంగా పరికించి.

"చెప్పమ్మా—" అన్నారు. మేనేజరు, గుమస్తా కలవరపడ్తూ మొహాలు చూసుకుని "ఏయ్ .... శ్యామలా కూర్చోకూర్చో.... జమీందారుగారు మాట్లాడుతూంటే మధ్యలో గొడవచేస్తావా-ఊ కూర్చో-" అంటూ ఉరిమి చూశారు. రంగారావు వారిని వారిస్తూ-'పరవాలేదు-ఇలా వచ్చి చెప్పమ్మా' అన్నారు అనునయంగా.

శ్యామల ధైర్యంగా వేదిక దగ్గిరకి వచ్చి భక్తిగా జమీందారు దంపతులకి నమస్కరించింది. 'తమరు ధర్మ ప్రభువులు మాలాంటి అనాధలు రోడ్డుమీదపడి అడుక్కుతినే గతి పట్టకుండా మీ దయవల్ల నిలవనీడ, తినడానికి యింత తిండి చూపించారు. కాని మీరు పెడుతున్న ఆ తిండి మేము తినగలుగుతున్నామో లేదో - ఆ తిండి మా నిర్భాగ్యుల నోటిదాక రాకముందే మధ్యలోనే గద్దలు తన్నుకుపోతున్నాయన్న సంగతి మీ కేమయినా తెలుసా-తెలియదు. అంతా మీలాంటి ధర్మాత్ములు దయగలవారే ఉండరన్న నిజం మీకుతెలియదు .... దేముడు వరములు యిచ్చినా: పూజారి వరము యివ్వనట్లు, గవర్నమెంటు-మీలాంటి ధర్మత్ములు యిస్తున్నడబ్బుతో మా కోరకు ఎంతవినియోగింపబడు తున్నది మీకు తెలియదు 'శ్యామల చాలా స్థిరంగా, శాంతంగా చెప్తుంది. రంగారావు తెల్లపోయారు. మేనేజరు, గుమస్తా బిత్తరపోయారు. చెమటలు పట్టడం ఆరంభించాయి వాళ్ళకి. శ్యామల అంత ధైర్యంగా

మాట్లాడుతూంటే పిల్లలంతా బెరుకుగా చూశారు. రంగారావు ఆశ్చర్యంగా .... "అంటే - నీ ఉద్దేశం ఏమిటి సరిగా చెప్పు" మీ కిక్కడ సదుపాయం సరిగా లేదా ?...."

"హుం - సదుపాయాలు-భోగాలు ఇవి మాలాంటి అనాధల కెక్కడనించి వస్తాయి. కావాలని ఎలా కోరుకుంటాం బాబుగారూ-మాకు కావల్సింది ఈ కడుపు నింపుకోడానికి రెండుపూటలా ఇంత తిండి-ఈ వళ్ళు దాచుకోడానికి ఇంత బట్ట అదే కరువయింది. ఇచ్చిన వాళ్ళిస్తున్నా మధ్యవాళ్ళు అవి మాదాకా రానీయడం లేదనిమనవి చేస్తున్నాను. మేనేజరుకంగారుగా లేచిపోయాడు. గబగబవేదికదగ్గరికివచ్చి ఉగ్రుడయి ఏదోచెప్పబోయాడు. జమీందారు అతన్ని చేత్తో వారించి "యింకవివరంగాచెప్పమ్మా మా కర్థం కాలేదు." శ్యామల - మేనేజరు వంక ఒకసారి తిరస్కారంగా చూసివేదిక దిగి చరచర లోపలికి వెళ్ళింది. అంతా తెల్లపోయి చూస్తుండగానే రెండు చేతుల్లో యిద్దరి చంటి పిల్లలని ఎత్తుకొని మరో యిద్దరు, నాలుగైదు సంవత్సరాల, పసివాళ్ళని తీసుకొచ్చి- "బాబూ....ఈ బిడ్డల్ని మీరే చూడండి? ఈ నోరేరుగని పసివాళ్ళని చూస్తే మీకు నేనేం చెప్పనక్కర లేకుండానే అర్థం అవుతుంది, ఇంత పసి పిల్లలు కూడా ఆకలివేస్తే ఏడవడానికి భయపడతారు. ఎందుకో తెలుసా - దొరికేది పాలుగాదు దెబ్బలు. శరణాలయానికి వచ్చే పాల డబ్బాలు తాగుతున్నది ఈ పసి వాళ్ళు గాదు - అదిగో ఆ పెద్దలు- అంతా లాలూచీ అయి శరణాలయానికి వచ్చే పాల డబ్బాలేమిటి - డబ్బేమిటి - దినుసులేమిటి - అన్ని వాళ్ళ పొట్టలలోకే వెళ తాయి. యింక మా పొట్టలకి మిగిలేదేమిటి? ఇదిగో ఈ ఏడాది నిండని పసివాళ్ళకి పాలుగాదు గంజి పడ్తారు. మేం అందరం చస్తే వాళ్ళకి తిండి దొరకదు గనక మా కందరికి చావకుండా బతికే పాటి తిండి పడేస్తారు. ఆ తిండి మనుషులు తినేదికాదు. ఆ బియ్యం గొడ్లు కూడా తినవు. పోనీ అదీ కడుపునిండా పెట్టరు. కూర అని పేరు దాన్లో వుండేవి రెండు కూరముక్కలు - మజ్జిగ అన్నది పేరుకే. రాత్రి యిచ్చేవి రెండు రొట్టెలు. ఆ రెండు గొంతు దింపుకోడానికి రెండు గ్లాసుల నీళ్ళు తాగాలి- రోజంతా స్కూలులో ఆకలి కడుపుతో మాడి వస్తే దొరికేది కప్పు టీ నీళ్ళు- బాబూ గారూ. మేం పెద్ద పిల్లలం. యోదో యిన్ని నీళ్ళు తాగి పొట్ట నింపుకుంటాం, అసలు యిక్కడ బతికి బతికి మా పొట్టలో ప్రేగులు ఎండిపోయి ఆకలి అన్నది ఏనాడో చచ్చిపోయింది మాలో. కాకపోతే యింకా ఎన్నాళ్ళు ఎలా బతుకుతాం-

శ్రద్ధగా ఆమె బాధ్యత తీసుకునే వాడాతను? అనుకుంటే ఆ ప్రశ్నకి జవాబు ఆయనకే తెలియలేదు.

ఆరోజేకాదు శ్యామల అక్కడున్న వారంరోజులు ఆయన రెండు పూటలా నర్సింగ్ హోమ్‌కివచ్చి శ్యామలని పలకరించేవారు. శ్యామల బిడియపడి వద్దంటుంటే నర్సింగ్ హోముకి రావడానికి ఏదో వంక ఎంచుకుని సాకుచెప్పేవారు. "ఇలా పనుండి వెళ్తూ ఎలాగోతోపీ అని వచ్చానని ఒకపూట' యేం తోచలేదు ఎలావున్నావో చూసి పోదామని వచ్చానని' ఒకసారి 'డాక్టరు నిన్నెప్పుడు డిస్చార్జి చేస్తాడో అడిగి బిల్ సెటిల్ చేద్దామని వచ్చానని' ఒకసారి-'నాకేమిటో వంట్లో సరిగాలేదు డాక్టరు దగ్గరికి వచ్చానని ఒక పూట ఇలా ఏదోవంకతో రెండు పూటలా వచ్చి శ్యామలని పలకరించి వెళ్ళేవాడు. ఆయన ఎందుకిలా వస్తున్నారో.ఎందుకింత శ్రద్ధతీసుకుంటున్నారో ఆయనకే తెలియలేదు, మొత్తంమీద ఆయనని శ్యామల ఎందుకో ఆకర్షించింది.

శ్యామల పెద్ద అందగత్తెకాదు. కాని చూడగానే ఏదో ఆకర్షణ కన్పిస్తుంది. సూటిగా వుండే ఆ చూపులలో తెలివితేటలు కన్పిస్తాయి. ఆమె గొంతులో మార్దవంతోపాటు పట్టుదల ధ్వనిస్తుంది. కనీ కనిపించకుండా మొహంలో ఎప్పుడూ విరిసే నవ్వు ఆమెకి అందానిచ్చింది. మొత్తంమీది ఆమెని చూడగానే ఎందుకో ఆకర్షించక మానరు.ఎవరూ-రంగారావు అంతే- ఎన్నిసార్లు శ్యామలకు వున్నదేమిటో వెతకాలని ఆమె మొహంలోకి చూసేవారు. అసలు ఆమె తనని ఎందుకంత ఆకర్షించిందో తెల్సుకోలేక పోయారు.

శ్యామల గాయాలు పూర్తిగా మానాయి. వారం రోజులయింది ఆమె అక్కడ చేరి. ఆవారంలో శ్యామల పట్ల ఏదో అనుబంధం కల్గింది ఆయనకి. మర్నాడు ఆమె డిస్చార్జ్ అయ్యే రోజు. ఆ రాత్రి అంతా రంగారావుకి నిద్ర పట్టలేదు. శ్యామలతో అనుబంధం రేపటికీ సరి అనుకుంటే ఆ మాట ఆయనకి నచ్చలేదు, కాని ... కాని.... ఏం చెయ్యాను. అసలు తన ఆలోచనకి ఒక రూపు ఏమీ ఏర్పడలేదన్న సంగతి అయనకి తట్టింది. ఆలోచన మధ్య ఒక ఆలోచన మనసులో కురిసింది. ఆ తర్వాత నిశ్చింతగా నిద్ర పోయారాయన.

మర్నాడు శ్యామల తాలూకు బిల్లులన్నీ చెల్లించారు. తరువాత శ్యామల గదిలోకి వెళ్ళారు. 'శ్యామలా నిన్ను నాతో తీసుకు వెళ్ళాలని నిర్ణయించాను.' అన్నారు హఠాత్తుగా. తన గదికి చేరుస్తానని ఆయన అంటున్నారనుకొని" అబ్బే వద్దండీ —

మీకు యిబ్బందివద్దు. యిన్నాళ్లు మీరు చూపిన దయచాలు."అందిబిడియంగా.

"అదికాదు" నీవు నాతో మావూరు వస్తావు. యింటికి తీసికెళ్తాను నిన్ను. అన్నారాయన శ్యామల మొహంకేసి చూసి. శ్యామల అర్థం కానట్టు తెల్లపోయి చూసింది.

"నన్నా.... మీ యింటికా – ...?" అంది ఆశ్చర్యంగా.

"అవును శ్యామలా– మా యింట్లో ప్రస్తుతం మా అమ్మగారు ఒక్కరే వుంటున్నారు. కారుయాక్సిడెంటులో నా భార్య, బిడ్డ పోవడం నీకు తెల్సుగదా.అప్పటి నుంచి మా అమ్మగారు మంచంపట్టి అంత యింట్లో ఆవిడ ఒక్కర్తె వుంటున్నారు. దాస దాసీలకి లోటు లేదనుకో. నేనిలా అస్తమానమూ వూర్లు తిరుగుతూంటే ఆవిడ ఒక్కర్తి ఏం కాలక్షేపం లేక పిచ్చెత్తినట్లు వుంటుంది. అంతేకాక పనివాళ్ళని అజమాయిషీ చేసేవారే లేకపోయారు. మా అమ్మగారికి తోడుగా వుంటు ఆమెకి, యింటికీ కావాల్సినవి చూస్తూ నీవక్కడ వుండాలని నా కోరిక – నీకీ ఉద్యోగంలో దొరికేదానికి రెట్టింపు డబ్బు యిస్తాను. నీ కభ్యంతరం వుండదన్న నమ్మకంలో అడుగుతున్నాను–' ఆమె మొహంలో హావభావాలు పరికిస్తూ సూటిగా అన్నారు. ఆ మాటలు విని నమ్మలేనిదానిలా చూసింది శ్యామల. తనేమిటి జమీందారుగారింట్లో వుండడం ఎమిటి? యింటి అజమాయిషీ చూడడం ఏమిటి–తనెక్కడ? వారెక్కడ? ఏం చెప్పాలో తోచలేదామెకు.

"ఏం – నీకు యిష్టంలేదా? నీ వక్కడ చేసే పనేం వుండదు. కేవలం అమ్మగారికి తోడుగా వుంటూ పనివాళ్ళు సరిగా అన్నీ చేస్తున్నారో లేదో చూడడం ... ...."

"అబ్బే.... అదికాదు – పనికోసం కాదు. ఏ పని చెప్పినా సంతోషంగా చేస్తాను. కాని... కాని.... నే నెక్కడ.... మీ రెక్కడ ... ఓ అనాధని.... నా కింత అదృష్టం"–

రంగారావు అదోలా నవ్వారు. "అలాంటి అనుమానాలేం పెట్టుకోకు. కాస్త చదువుకున్న దానివి–అమ్మకి కాలక్షేపానికి యివి అవి చదివి వినిపిస్తావని–లెక్కలవీ చూడగలవని రమ్మంటున్నా–ఇదివరకులా యింట్లో మేనేజర్లు – గుమస్తాలు అంత మందిని భరించే తాహత మాకు యిప్పుడు లేదు. మేమిప్పుడు జమిందార్లం కాము అన్న సంగతి నీకూ తెలుసు. గవర్నమెంటు యిచ్చే ప్రీవీపర్సులు రద్దయ్యాయి.

కేవలం భూములవల్ల వచ్చే ఆదాయాలు, ఇళ్ళు మాకు మిగిలాయి. మేము ఇప్పుడు సామాన్యులతోపాటే—" నవ్వారాయన.

"అలా అనకండి-మీ రెప్పటికి మాకు ప్రభువులే-మాకు అన్నదాతలే. మీకు సేవ చేయడంకంటె నాకు ఆనందాన్నిచ్చేది ఏముంటుంది. ఈ విధంగా మీ ఋణం తీర్చుకోగలిగే అవకాశం వచ్చినందుకు చాలా సంతోషంగా వుంది. ఒక్క మనవి - ఇన్నాళ్ళు మీ దయాధర్మాలమీద బతికినా ఇప్పుడూ కేవలం ఆ దయ చాలు-నాకేం జీతంవద్దు మీ ఆశ్రయం చాలు-" కృతజ్ఞతతో ఆమె గొంతు వణికింది. ఆమెకి తమపట్ల గౌరవాభిమానాలకు ఆయన కొస్త చలించారు. ఆమెపట్ల అభిమానం మరింత ఎక్కువైంది

"సరే-అక్కడ నీ కేలోటురాదు. సరే ఇంక బయలుదేరుదాం - నీ గదిలో సామాను సర్దుకో-యివాళ మధ్యాహ్నమే బయలుదేరి వెడదాం ...." అన్నారు రంగారావు.

* * *

జమీంధారు భవంతిలో కాలు పెడుతూ ఆశ్చర్యంగా నాలుగువైపులా ఆ వైభవాన్ని చూసింది శ్యామల. పూర్వపు జమిందార్ల భోగభాగ్యాలు యిప్పుడు లేకపోయినా ఆ పాత వైభవాన్ని అడుగడుగునా చాటుతూనే వుంది ఆ భవంతి. ఎంత జమీలు పోయినా ఆ హోదా పూర్తిగా దూరం కాలేదు. జమీందార్లకి తమ పాత అలవాట్లు-అభిరుచులు, వైభోగాలు దూరం చేసుకోవాలంటే యిప్పట్లో సాధ్యం కాదేమో-వారి రక్తంలోవున్న రాచరికం డబ్బు లేకపోయినా గంభీరత్వాన్ని హుందాని యిస్తూనే వుంటుంది. ఇదివరకు మాదిరి అడుగడుగునా దాస దాసీజనం లేకపోయినా యిప్పుడూ అవసరాన్నిమించే ఉన్నారు నౌకర్లు-చాకర్లు.

యజమాని వెంట కారు దిగుతున్న యువతిని పనివారందరూ ఆశ్చర్యంగా చూచారు-వాళ్ళల్లో వాళ్ళే ప్రశ్నార్థకంగా చూసుకున్నారు. అతి సామాన్యంగా వున్న యువతి జమీందారుతో కారులోకూర్చుని రావడం చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది.

రంగారావు ఇంకా పూర్తిగా లోపలికి వెళ్ళిపోకుండానే ఆ వార్త వృద్ధ జమీందారిణికి దాసిద్వారా తెల్సిపోయింది. రంగారావు శ్యామలని వెంటబెట్టుకు తల్లి గదిలోకి వచ్చే క్షణం లోపలే ఆవిడ మనస్సులో రకరకాల ఆలోచనలు చోటుచేసు